ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★ శుక్రవారం 23 ఫిబ్రవరి 2024



కొలువుదీరిన తల్లులు

- గద్దెలపైకి చేరిన సమ్మక్క సారలమ్మ
- జాతర ప్రాంగణాలకు పోటెత్తిన భక్తులు


గోదావరిఖనిలో సమ్మక్కను తీసుకవస్తున్న కోయ పూజారులు


సమ్మక్కకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వన దేవతల జాతరలో మహాఘట్టం ప్రారంభం అయ్యింది. భక్తుల కోలాహలం మధ్య, మేళా తాళాలు, డప్పుల చప్పుళ్లతో కోయ పూజారులు కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకవచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. సమ్మక్క తల్లి వచ్చి గద్దెలపై కొలువు దీరడంతో ఒక్కసారిగా జాతర ప్రాంగణాలన్నీ కిటకిటలాడాయి. తల్లులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లాలోని గోదావరి ఒడ్డున గల అంతర్గాం మండలం గోలివాడ, గోదావరిఖని గంగ బ్రిడ్జి వద్ద, మానేరు తీరం వెంబడి సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల, ఓదెల మండలం కొలనూరు, మైదం బండ, ఈసాల తక్కళ్ల పల్లి, వేమునూరు, రానాపూర్, ధర్మారం, ఎర్రగుంటపల్లి, కటికనపల్లి, ఎలిగేడు, గర్రెపల్లి, మీర్జంపేట, హనుమంతుని పేట, తురకల మద్దికుంట తదితర ప్రాంతాల్లో జాతరలకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరి, మానేరులో పుణ్య స్నానాలు ఆచరించి సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని మొక్కులు సమర్పిస్తున్నారు. ఇంటిల్లిపాది చల్లంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండేలా చూడాలని భక్తులు కోరుకుంటున్నారు. ఆయా జాతర ప్రాంగణాలను ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు సందర్శించి పలు సూచనలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పాలకుర్తి: మండలం పరిధిలోని వేమునూర్, రాణాపూర్, ఈసాలతక్కళ్ళపల్లిలో గురువారం కుంకుమ భరిణె రూపంలో ఉన్న వనదేవత సమ్మక్క గద్దెల వద్దకు చేరుకుంది. తక్కళ్లపల్లిలో జరిగిన జాతరలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, కేశోరాం ప్లాంట్ హెడ్ మండల శ్రీనివాసరెడ్డి, చైర్మన్ గాలిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని ధర్మారం, ఎర్రగుంటపల్లి, కటికెనపల్లి, కొత్తూర్, నందిమేడారం, బొట్లవనపర్తి, దొంగతుర్తి,చామనపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో గురువారం సమ్మక్కను కోయ పూజారులు గద్దెల వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఎర్రగుంటపల్లిలో సమ్మక్క-సారలమ్మకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ఉన్నారు.

మంథని: మంథని డివిజన్‌లోని పలు గ్రామాల్లో భక్తజనం సాక్షిగా గురువారం సాయంత్రం మేడారం నుంచి వచ్చిన కోయ పూజారులు సమ్మక్క తల్లిని డప్పుచప్పుళ్ళ మధ్య గద్దెకు చేర్చారు. దీంతో తల్లులను దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మేడారంలో మొక్కులు చెల్లించుకోవటానికి గురువారం అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. దీంతో మంథని బస్టాండ్‌లో భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మంథని రూరల్: మండలంలోని ఖానాపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో గురువారం సమ్మక్క-సారల మ్మ జాతర నిర్వహించారు. గురువారం గ్రామ శివారులోని గద్దెల వద్దకు సారలమ్మను పూజారులు తీసుకురావడంతో గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల ప్రజలు దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. శివ సత్తులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్న తరువాత అక్కడే వన భోజనాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో డప్పుచప్పుళ్ళ, శివసత్తుల నృత్యాలు, భక్తజన సందోహం మధ్య గురువారం కోయ పూజారులు సమ్మక్కకు తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులను చెల్లించుకుంటున్నారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ ఓంకార్ యాదవ్ బందోబస్తు నిర్వహించారు. జాతరను తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రాంమోహన్‌చారి పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జూలపల్లి : మండలంలోని తెలుకుంట, అబ్బాపూర్ గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మల జాతర ఘనంగా నిర్వహించారు. తెలుకుంటలో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మలను ఎమ్మెల్యే విజయరమణారావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వెంట దారబోయిన నర్సింహయాదవ్, సొల్లు శ్యాం తదితరులు ఉన్నారు.

కమాన్‌పూర్ : మండలంలోని గుండారంలో సమ్మక్క-సారలమ్మలను గురువారం మంథని ఆర్డీవో హనుమనాయక్ గురువారం దర్శించుకున్నారు. గద్దెల వద్ద ఆర్డీవో మొక్కులు చెల్లించుకున్నారు. జాతర పరిస్థితిని చైర్మన్ పిడుగు శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎస్సై మామిడాల చంద్రశేఖర్, ఎంపీడీవో వెంటశేషయ్య తదితరులు ఉన్నారు.

ఎలిగేడు : ఎలిగేడు, లాలపల్లి పొలిమేరల్లోని పెల్లిపోరు గుట్టపై గురువారం సమ్మక్కను కోయ పూజారులు డప్పుచప్పుళ్లతో ప్రత్యేక పూజలు చేసి గద్దెపై ప్రతిష్ఠించారు. ఎలిగేడు, లాలపల్లిలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మలను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దర్శించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనతో విశాక ఇండస్ట్రీస్ ఎండీ గడ్డం వంశీకృష్ణ సమ్మక్క-సారలమ్మ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, నాయకులు సామ రాజేశ్వర్‌రెడ్డి, గొల్లె కావేరిభూమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని నీరుకుళ్లలో గురువారం సమ్మక్కను కోయ పూజారులు తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. ఇద్దరు తల్లులను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. గర్రెపల్లి, నారాయణపూర్, తొగర్రాయి గ్రామాల్లోనూ సమ్మక్కను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. గర్రెపల్లి, నారాయణపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు, జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాష్‌రావు దర్శనం చేసుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని తుర్కలమద్దికుంట, హన్మంతునిపేట, పెద్దకల్వల గురువారం అడవుల నుంచి సమ్మక్కను తీసుకువచ్చి జాతర ప్రాంగణంలోని గద్దెలపై ప్రతిష్ఠించారు. భక్తులు తల్లుల దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంతర్గాం: గోలివాడలో సమ్మక్క తల్లి గురువారం సాయంత్రం గద్దెకు చేరుకుంది. కంకవనంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి డప్పుచప్పుళ్ల మధ్య జాతర ప్రాంగణానికి కోయ పూజారులు అమ్మవారిని తీసుకువచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటస్వామి బందోబస్తు నిర్వహించారు.

కోల్‌సిటీ : గోదావరిఖని గోదావరి తీరం భక్తజన సంద్రమైంది. గురువారం సమ్మక్క రాకతో గోదావరిఖని జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. సాయంత్రం జనగామలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు పూజలుచేసి సమ్మక్క తీసుకువచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకుడు గడ్డం వంశీ హాజరై పూజలు నిర్వహించారు. గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, టుటౌన్ సీఐ ప్ర సాద్‌రావు రోప్‌పార్టీలతో బందోబస్తు నిర్వహిం చారు. గద్దెల వద్ద ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, మనాలి దంపతులు, జాతర కమిటీ ప్రతినిధులు పూజలు నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మలు కొలువు తీరడంతో జనం మొక్కులు తీర్చుకోవడానికి వేలాదిగా తరలివచ్చారు.

ఓదెల : కొలనూర్ గుట్టల్లో సమ్మక్క గురువారం కొలువుదీరింది. కోయ పూజారులు భక్తులతో తరలివెళ్లి ధన గుట్ట గుహలో ఉన్న సమ్మక్కను తీసుకవచ్చి జాతరలో గద్దెపై ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు సమ్మక్క,సారలమ్మ, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. ఏసీపి గజ్జికృష్ణ, ఎస్సై అశోక్‌రెడ్డి పర్యవేక్షించారు.


ఖనిలో బంగారం మొక్కు తీర్చుకునేందుకు వస్తున్న కుటుంబం


తుర్కలమద్దికుంటలో సమ్మక్కను తీసుకవస్తున్న కోయ పూజారులు




ఖనిలో సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం భక్తుల క్యూలైన్


ఈసాలతక్కళ్ళపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మీర్జంపేటలో సమ్మక్కను తీసుకవస్తున్న భక్తులు


ఎర్రగుంటపల్లిలో మొక్కులు చెల్లిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


తెలుకుంటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


గుండారంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న ఆర్డీవో


నీరుకుళ్లలో సమ్మక్కను తీసుకవస్తున్న కోయపూజారులు


నీరుకుళ్లలో వన దేవతల దర్శనం కోసం పోటెత్తిన భక్తులు


గర్రెపల్లిలో బంగారం సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


పొర్లుదండాలు పెడుతున్న భక్తులు


కొలనూరులో భక్తుల సందడి..


ఎలిగేడులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జాతరకు ఎన్టీపీసీ రూ.50 లక్షల విరాళం


అధికారులకు చెక్కును అందజేస్తున్న ఎన్టీపీసీ ఈడీ

జ్యోతినగర్, ఫిబ్రవరి 22 : రామగుండం ఏరియాలోని సమ్మక్క,సారలమ్మ జాతరలకు ఎన్టీపీసీ యాజమాన్యం 50లక్షల రూపాయల విరాళాన్ని అందజేసింది. అంతర్గాం మండలం లోని గోలివాడ జాతరకు 30లక్షల రూపాయలు, గోదావరి శివారు(జనగాం) లోని జాతరకు 20లక్షల రూపాయలను ఎన్టీపీసీ కేటా యించింది. ఆయా జాతరలలో పారిశుధ్యం, లైటింగ్, రంగులు తదితర అవసరాలకు ఈ డబ్బు అందజేసింది. ఈమేరకు గురువారం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు రామగుండం కార్పొరేషన్, మండల అధికారులకు చెక్కును అందజేశారు.

గోదావరిఖని బస్టాండ్‌లో ట్రా'ఫికర్'

- ఆటోడ్రైవర్ల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 22: గోదావరిఖని బస్టాండ్‌లో ఆటోలతో బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లోకి వచ్చే దారిలో ఆటోలను అడ్డుగా పెడుతుండడంతో బస్సులు లోపలికి వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకేసారి గుంపులుగుంపులుగా ఆటోలు అడ్డం పెట్టడంతో బస్సులు ఆటోలను ఢీకొడుతున్నాయి. అయినప్పటికీ ఆటో డ్రైవర్లు రోడ్డు మీదకే తీసుకురావడంతో తాము లోపలికి వెళ్లలేక పోతున్నామంటూ బస్సుల డ్రైవర్లు పేర్కొంటున్నారు. ఎన్నిసార్లు ఆటో డ్రైవర్లకు చెప్పినా వినడం లేదని, అకస్మాత్తుగా బస్సుల ముందుకు ఆటోలను తీసుకురావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రమాదాలకు తమనే అధికారులు బాధ్యులను చేస్తున్నారని వాపోతున్నారు. కూతవేటు దూరంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఆటో వాలాలను నియంత్రించలేక పోతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాజీవ్ రహదారి నుంచి వచ్చే భక్తులు లోపలికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. యూనియన్లు కూడా పట్టించుకోకపోవడంతో ఆటోవాలాలు రోజురోజుకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఒకేసారి గుంపులుగుంపులుగా ఆటోలు రావడంతో బస్సు డ్రైవర్లు అకస్మాత్తుగా బ్రేకులు వేయడం, వెనుక నుంచి వచ్చిన వాహనాలు ఢీకొట్టిన సంఘటనలున్నాయి. రాత్రి వేళల్లో ఆటో డ్రైవర్‌కు మరొకరు తోడుగా పెట్టుకుని ప్రయాణికుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నారు. ఇప్పటికైనా గోదావరిఖని బస్టాండ్‌లో ట్రాఫిక్ గందరగోళం సృష్టిస్తున్న ఆటోడ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, బస్సు డ్రైవర్లు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


బస్టాండ్ లోపలికి వెళ్లే దారిలో ఆటోలు..

భూ సమస్యల పరిష్కారానికి నివేదికలు సిద్ధం చేయాలి : కలెక్టర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి ధరణిలో చేయాల్సిన చేర్పులు, మార్పులు, చట్టాల సవరణ, మొదల గు వాటిపై ఇవ్వాల్సిన నివేదికలను సిద్ధం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తన క్యాంపు కార్యాలయంలో భూసమస్యల పరిష్కారానికి ధరణి కమిటీ సమావేశానికి అందించాల్సిన నివేదిక రూపకల్పనపై అదనపు కలెక్టర్‌లు జే.అరుణశ్రీ, జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. జిల్లాలో భూ సమస్యలపై ధరణి, ప్రజావాణి ద్వారా వస్తున్న దరఖాస్తులు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణిలో అందుబాటులో ఉన్న మాడ్యుల్స్‌లో వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. భూ సమస్యల పరిష్కారానికి ధరణి కమిటీ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించనుందని, ఇందుకోసం మండలాల వారీగా పెండింగ్ ధరణి దరఖాస్తులు, ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ ఉండడానికి గల కారణాలతో కూడిన నివేదిక తయారుచేసి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కార సమయంలో సర్వే నిర్వహణ, సెటిల్మెంట్, పట్టాల జారీలో ఎదురవుతున్న సమస్యల వివరాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలతో సంపూర్ణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు సీహెచ్ మధుమోహన్, హనుమా నాయక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, పెద్దపల్లి, రామగుండం తహసీల్దార్‌లు, రెవెన్యూ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

గీత కార్మికుడికి గాయాలు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 22: మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు చిలివేరి రాజమల్లయ్య గురువారం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య వృతిరీత్యా కల్లు గీస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇదే క్రమంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ప్రమాదంలో రాజమల్లయ్య కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

తాత్కాలిక రోడ్డును పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్



రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేఆది శ్రీనివాస్

చందుర్తి, ఫిబ్రవరి 22: చందుర్తి నుంచి మోత్కురావుపేట వెళ్లే రహదారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి జాతరకు జగిత్యాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులను చేపట్టగా పనులను పరిశీలించారు. స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ రోడ్డు ద్వారా వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

నాటక రంగ ప్రముఖుడు రాజేశం మృతి



రాజేశం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 22: భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాటక రంగ ప్రముఖుడు మ్యాదారం రాజేశం (65) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రాజేశం వృత్తి రీత్యా లోయర్ మానేరు డ్యాం క్యాంపులో ట్రేసర్‌గా, డ్రాఫ్ట్ మెన్‌గా, జెటీఓగా పనిచేశారు. నాటక రంగంపై ఆసక్తితో ఎల్ఎండీలో తిమ్మాపూర్ గ్రామ నవోదయ సమితి కళాకా రులతో, నీటిపారుదల శాఖ ఉద్యోగి గోపన్నతో కలసి శ్రీవేంకటేశ్వర కళా సమితిని ప్రారం భించారు. రాజేశం మృతి పట్ల జిల్లా సాంస్కృతిక సంస్థల, కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైఎస్ శర్మ, గజ్జె లక్ష్మణ్, కుమార్ మహర్షి, అనిల్‌కుమార్‌గౌడ్, జి కృపాదానం, జి రఘువీర్‌సింగ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామానికి చెందిన కొత్తూరి మోహన్(19) అక్కడికక్కడే మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. మోహన్ తన ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి 11:30 గంటలకు వల్లంపహాడ్‌లోని తన ఇంటి నుంచి కిరాణం షాపునకు వెళ్తుండగా ఎదురుగా రాంగ్‌రూ ట్‌లో వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో మోహన్ తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి కొత్తూరి రవి ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద..

పాలకుర్తి, ఫిబ్రవరి 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్ టోల్ ప్లాజా వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఎంఎ ఖదీర్(53) రామగుండం ట్రెజరరి కార్యాలయంలో సబ్ ఆర్డినేట ర్‌గా విధులు నిర్వ హిస్తున్నాడు. రోజు మాది రిగానే పెద్దపల్లి నుంచి రామగుండంకు ద్విచక్రవాహనం (టీఎస్ 02ఈసీ 7358)పై వెళుతున్నాడు. ఆ సమయం లో టోల్‌గేట్ వద్ద ఓ లారీ నిలిపి ఉంది. అదే సమ యంలో మరో లారీ (టీఎస్ 01 యూబీ 3847) పెద్దపల్లి నుంచి గోదావరిఖని వైపు వెళ్లుతోంది. ఒక లారీ నిలిపి ఉండడం మరోలారీ పక్కనుంచి వేగంగా దూసుకొచ్చింది. దీంతో బైక్‌పై ఉన్న ఖదీర్‌ను లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో ఖదీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా రోడ్డు ప్రమాదానికి కారణమైన రెండు లారీలను స్వాధీనం చేసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై తెలిపారు.

ధర్మపురిలో వివాహిత..

ధర్మపురి, ఫిబ్రవరి 22: ధర్మపురి పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన సంఘటనలో తొట్ల గంగవ్వ(55) అనే మహిళ గురువారం రాత్రి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక లక్ష్మీనరసింహ కాలనీకి చెందిన గంగవ్వ సమీపంలో గల సమ్మక్క-సారలమ్మ దర్శనం కోసం వెళ్లింది. తిరుగు ప్రయాణంలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరొక రిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గంగవ్వకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉదయ్‌కుమార్ పరిశీలించారు.

కరీంనగర్‌లో ఆటో డ్రైవర్..

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22 : కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రి చౌరస్తాలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో హౌస్సేనిపురకు చెందిన ఆటో డ్రైవర్ ఎండీ అఫ్జలొద్దీన్(45) మృతి చెందాడని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు విద్యార్థులను తీసుకువెళుతూ సన్‌రైజ్ ఆసుపత్రి చౌరస్తాలో ఒక స్కూటీని తప్పించబోయి ట్రాఫిక్ స్టాండ్‌ను ఢీకొట్టాడని తెలిపారు. అఫ్జలొద్దీన్ తలకు, చేతులకు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని రైతు ..

కథలాపూర్, ఫిబ్రవరి 22: మండలంలోని కలికోటలో బుధవారం రాత్రి మిరప తోటకు కాపలా వెళ్తున్న రైతును కారు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోలి నరసింహారెడ్డి (55) అనే రైతు తన మిరప తోట వద్దకు కాపలా నిమిత్తం వేములవాడ - కోరుట్ల రోడ్డు వెంట నడిచి వెళ్తున్నాడు. కోరుట్ల నుంచి రుద్రంగి వైపు వెళ్తున్న కారు నరసింహారెడ్డిని అతివేగంతో ఢీకొట్టింది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటువైపుగా వెళ్తున్న వాహనదారులు చికిత్స నిమిత్తం కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రుద్రంగికి చెందిన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడు..

కోరుట్ల, ఫిబ్రవరి 22: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణానికి చెందిన కొమురపల్లి రాకేష్ (35) అనే యువకుడు మెట్‌పల్లి వైపు వెళుతున్నాడు. పట్టణ శివారులోని కావేరి గార్డెన్ వద్ద నాగులపేట గ్రామం నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో రాకేష్ తీవ్రగాయాలై సంఘటన స్థలంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒకే భూమిని పలువురికి విక్రయించిన కేసులో ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 22: మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఒకే భూమిని పలువురికి విక్రయించి మోసగించిన ముగ్గురు వ్యక్తులను ఎల్ఎండీపోలీసులు గురువారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందిరానగర్ గ్రామంలోని సర్వే నంబరు 752/బీలో 600చదరపు గజాల(నాలుగు ప్లాట్లను) భూమిని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రంగు వెంకటాచారి కొనుగోలు చేశాడు. ఈ భూమిని కరీంనగర్‌లోని కార్ఖానగడ్డకి చెందిన నజీర్ అహ్మద్ ఖాన్ పేర ఉంది. కరీంనగర్‌లోని అహ్మద్ పురకి చెందిన మోహ్మద్ సిరాజుద్దీన్ పేర జీపీఏ హోల్డర్‌గా ఉన్నాడు. ఈ భూమి తన పేర అగ్రిమెంట్ ఉన్నదని తిమ్మాపూర్ కి చెందిన శ్రీరామోజు శ్రీనివాస్ చెప్పి వెంకటచారితో 10 లక్షల,95వేల రూపాయల ధర చెసుకున్నాడు, ఇందుకు గాను అదే రోజు వెంకటాచారి నుంచి 1,95వేల రూపాయలు అడ్వాన్స్ శ్రీరామోజు శ్రీనివాస్ తీసుకున్నాడు. 2013లో జనవరిలో మిగతా డబ్బులు చెల్లించి వెంకటచారి రిజిస్ట్రేషన్ చెయించుకున్నాడు. అనంతరం 2022 మార్చిలో వెంకటచారి తను కొనుగోలు చేసిన భూమి వద్దకు వెళ్ళి చదును చేస్తుండగా నన్నపరాజు నరేందర్ రాజు అక్కడికి చేరుకొని అడ్డుకున్నాడు. తను అ భూమిని దాసరి స్వాతి అనే వారి వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను చూపించాడు. స్వాతి 2013లో కప్ప మోహన్ సింగ్ అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసినట్లు నరేందర్ రాజు దస్తావేజులను చూపించాడు. దీంతో అవాక్కయిన వెంకట చారి తను మోసపోయినట్లు, ఒకే భూమిని పలువురికి రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో శ్రీరామ శ్రీరామోజు శ్రీనివాస్, నజీర్ అహ్మద్, జీపీఏ అయిన మహమ్మద్ సిరాజుద్దీన్‌పై ఫిర్యాదు చేశాడు. బాధితుడు వెంకట చారిని చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శ్రీరామోజు శ్రీనివాస్, నజీర్ అహ్మద్ ఖాన్, మహమ్మద్ సిరాజుద్దీన్ లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తాకితే మాడిమసై పోతారు

- ప్రతిపక్షాలు ఆత్మ విమర్శ చేసుకోవాలి - మంత్రి పొన్నం ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్ను కున్న తమ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాల్చేస్తాం, కూల్చేస్తామంటూ ప్రతిపక్షాలు అవాకులు, చవాకులు పేలుతున్నాయని, తమ ప్రభుత్వాన్ని తాకితే మాడిమసై పోవడం ఖాయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేకుర్తి సమ్మక్క-సారలమ్మ గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈసందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణతో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండు నెలల ప్రజా ప్రభుత్వం పై బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు పన్నుతు న్నాయని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, తెలంగాణాలో బీజేపీ ఆటలు సాగవని పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 70 రోజులు కాకముం దే ఓపిక కోల్పోయి స్పష్టత లేక మాట్లా డుతున్నారని, గత ప్రభుత్వాలు ఆత్మవి మర్శ చేసుకోవలసిన అవసరముందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ దిగజారిందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉందని అన్నారు. కేసీఆర్ సహకారంతో కిషన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారని, అసలు బండి సంజయ్ కుమా ర్‌ని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తప్పించారో తెలుపాలని ప్రశ్నించారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, మార్చిలో మరో రెండు సంక్షేమ పథకాలను తప్పక అమలు చేస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి ప్రజలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇస్తు బాగుంటుందని సూచించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● ఆలయ అభివృద్ధికి సహకారం

శంకరపట్నం: శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీం ద్రస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని కొత్తగట్టు శ్రీమత్స్యగి రీంద్రస్వామిని గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి మంత్రి పొన్నం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పాలకవర్గ సభ్యులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వారికి ఆశీర్వాదం అందించారు. అనంతరం మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడారు. భక్తులకు సౌకర్యార్థం దేవుడిఆశీస్సులతో మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తామన్నారు. కొత్తగట్టు గుట్టపైన భక్తుల సౌకర్యార్థం తాగునీరు సమస్యను తీర్చడం కోసం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాచరిక పాలనకు గుణపాఠం

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్కీంలు స్కాంలకే - కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 22: తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల రాచరిక పాలనకు ప్రజలు విసిగిపోయి అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు మాట్లాడటం అర్థరహితమన్నారు. కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్‌లు తెలంగాణ ఉద్యమంలో ఏనాడూ జైలుకు వెళ్లలేదని, లాఠీదెబ్బలు తిన లేదని అన్నారు. కేసీఆర్ దొంగ దీక్షతో, హరీష్‌రావుకు అగ్గిపెట్ట దొరక లేదని యువతను రెచ్చగొట్టడం మూలంగా శ్రీకాంతాచారితో పాటు 12 వందల మంది ఆత్మహత్య లు చేసుకు న్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టులతో కేసీఆర్, హరీష్‌రావులు లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ స్కీంలు స్కాంల కోసమేనని, కాంగ్రెస్ స్కీంలు మాత్రం రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమని ఆయన అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానం కోసం కాంగ్రెస్‌పార్టీ నుంచి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తానని గజ్జెల కాంతం తెలిపారు. సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యు వజన సంఘం జిల్లా అధ్యక్షులు సముద్రాల అజయ్, నాయకులు దండి గణేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిశువు అపహరణ కేసులో వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 22: కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఈనెల 18న జరిగిన శిశువు అపహరణ ఘటనలో అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఈ సంఘనపై విచారణ జరిపించారు. సిబ్బంది నిర్లక్ష్యంతోనే శిశువు అపహరణ జరిగినట్లు విచారణలో తేలడంతో బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 10 మంది నర్సింగ్ సిబ్బంది, ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మల్లాపూర్, ఫిబ్రవరి, 22: మండలంలోని సిర్పూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను బుధవారం రాత్రి ఎస్సై కిరణ్‌కుమార్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ గ్రామ శివారులో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్ప దంగా వెళ్తున్న వాహనం(ఏపీ16టీజీ7036) తనిఖీ చేయగా 15క్వింటాల రేషన్ బియ్యం తరలిస్తుండడాన్ని గుర్తించారు. వారిని విచారించగా మండలంలో సేకరించిన రేషన్ బియ్యా న్ని మెట్‌పల్లికి తరలిస్తున్నట్లు వారు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనం, బియ్యం స్వాధీనం చేసుకొని ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ కబ్జాకు పాల్పడ్డారనే ఆరోపణలపై గురువారం మరొకరిని అరెస్టు చేశారు. రెండు రోజుల కిందట 9 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు అదే రోజు నందెల్లి మహిపాల్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో గట్టుబూత్కూరు మాజీ సర్పంచ్ గంగాధర కనుకయ్యను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కనకయ్యను కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కనుకయ్యను పోలీసులు జైలుకు తరలించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం

- పెద్దఎత్తున భక్తుల రాక- హాజరైన ఎమ్మెల్యే దంపతులు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 22: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అశ్వ వాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి వారలను భాజ భజంత్రీలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు దంపతులు, కుటుంబ సభ్యులు, ఈవో వి అనూష మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ఎదుర్కొని కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో నృసింహ స్వామి కల్యాణం వైభవంగా అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, యాగ్నీకులు శ్రీనాథాచార్యులు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంరూపాదేవి, జడ్పీటీసీ ప్రశాంతి హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, పూడూర్ సింగిల్ ఉపాధ్యక్షుడు రమేష్, మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు. కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రూ. లక్ష 28వేల ఆదాయం..

నల్లగొండలో గురువారం నిర్వహించిన శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణానికి లక్ష 28వేల 996రూపాయలు సమకూరినట్లు ఆలయ ఈవో అనూష తెలిపారు. ఆలయంలో వేలం, ఆలయం నుంచి అమ్మిన టిక్కెట్లు, దాతలు స్వామి వారికి చదివించిన కట్నాల ద్వారా ఈ నగదు సమకూరినట్లు ఈవో తెలిపారు.

సహకార బ్యాంకుల అభివృద్ధికి సహకరించాలి

- ప్రభుత్వ, స్థానిక సంస్థలు ఖాతాలు తెరవాలి - నాఫ్స్ కాబ్ ప్రాంతీయ సమావేశంలో తీర్మానం



కర్ణాటక సీఎంను సన్మానిస్తున్న నాఫ్స్ కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 22: సహకార బ్యాంకుల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల, దేవాదాయశాఖ కరెంటు ఖాతాలను తెరిచి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరుతూ నాఫ్స్ కాబ్ ప్రాంతీయ సమావేశంలో తీర్మానించారు. గురువారం బెంగుళూరులో రాష్ట్ర సహకారశాఖ మంత్రి కె.రాజన్న సౌజన్యంతో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధ్యక్షతన నాఫ్స్‌కాబ్ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా హాజరైనట్లు రవీందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సహకార బ్యాంకుల ద్వారా మొత్తం క్రెడిట్‌లో ప్రస్తుతం ఉన్న 13శాతం నుంచి 50శాతానికి వాటాను 2022 నుంచి 2047 వరకు చేరుకునేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలని చర్చలు చేసినట్లు తెలిపారు. జిల్లా బ్యాంకుల వ్యాపారాన్ని విస్తరించుట, వ్యవసాయంతో పాటుగా ఇతర వాణిజ్య కార్యకలాపాలకు రుణాలు మంజూరు చేయడం, డిపాజిట్ల సేకరణ, సహకార సంఘాల ద్వారా వ్యాపార కార్యకలాపాలు విస్తరించుట తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల రాష్ట్ర సహకార బ్యాంకుల అధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్లు, జిల్లా అధ్యక్షులు, సీఈవోలు, కర్ణాటక బ్యాంకు రాష్ట్ర అధ్యక్షుడు, నాఫ్స్‌కాబ్ ఎండీ బీమ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి, ఫిబ్రవరి 22: ధర్మపురి మండలంలోని చిన్ననక్కల పేట గ్రామానికి చెందిన బోర్లకుంట రాజన్న (50) అనే వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకు న్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొద్ది రోజులుగా రాజన్న మతి స్థిమితం లేక ఇంటి వద్దనే అన్న పెద్దపోశం వద్ద ఉంటున్నాడు. గురువారం ఉదయం పెద్దపోశం ధర్మపురి మార్కెట్‌కు పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి క్రిమిసంహారక ముందు తాగి రాజన్న మృతి చెంది ఉండటాన్ని గుర్తించాడు. అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 22: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన పెగడ దేవక్క (53) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో సమ్మక్క సారలమ్మ పండుగ నిర్వహణ విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడింది. దీంతో క్షణికావేశంలో దేవక్క ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్ నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం ఆగదు



జైలు నుంచి విడుదలైన వారికి స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 22: పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాటం ఆగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏపీ రమణ, కరీంనగర్ జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. జగిత్యాలలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేసి జైలుకు వెళ్లి గురువారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదలైన నాయకులకు సీపీఎం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ భూమిలో వందలాది ఎకరాల్లో 15వేల మంది పేదలతో భూ పోరాటం చేసిన నాయకులు 38 రోజుల పాటు జైలులో ఉన్నారన్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు దక్కేంత వరకు సీపీఎం ప్రజా సంఘాలను కలుపుకుని ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు పుప్పాల శ్రీకాంత్, గోరెంకల నర్సింహ, వర్ణవెంకట్‌రెడ్డి గీట్ల ముకుంద రెడ్డి, డి నరేష్‌పటేల్, లెల్లల భవాని, కొప్పుపద్మ, జిరమేష్, చంద్రయ్య, వెంకటా చారి, రఫిక్, వినోద్, గజ్జల శ్రీకాంత్, నవీన్, గణేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 22: మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడి ఇద్దరు వాహనదారులకు కరీంనగర్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఒకరికి 10 రోజులు, మరొకరికి 3 రోజుల జైలు శిక్ష లేదా ఇద్దరికి కలిపి మొత్తం 3,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ముగ్గురు వాహనదారులకు 5,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదం చేసిన వ్యక్తికి రిమాండ్

ముస్తాబాద్, ఫిబ్రవరి 22: రోడ్డు ప్రమాదం చేసి ఒకరి మృతికి కారణమైన వ్యక్తిని అరెష్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం ముస్తాబాద్ నుంచి లింగన్నపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తుర్కపల్లె గ్రామానికి చెందిన ఆనంద్ ఎదురుగా ఆటోతో వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సింలు మరణించగా దేవయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మృతికికారణమైన ఆనంద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

మానకొండూర్, ఫిబ్రవరి 22: మండలంలోని చెంజర్ల గ్రామ శివారు కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి.చెంజర్ల గ్రామంలోని దాణా కంపెనీలో పని చేస్తున్న మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన ప్రశాంత్ (40) శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ప్రసాద్ (43) అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై చెంజర్లపై వస్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉందని 108 ఈఎంటీ చిరంజీవి, పైలెట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి, ఫిబ్రవరి 22: ఎదురుగా వస్తున్న ఓ కారును తప్పించబోయిన ఓ ద్విచక్రవా హనదారుడు రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో యువతి, యువకుడికి గాయాలైన సంఘటన చందుర్తి మండలం బండపల్లి, ఎనగల్ గ్రామాల మధ్య గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బండపల్లి గ్రామంలో కార్మికులకు వైద్య సేవలు అందించి తిరిగి వేములవాడకు బైక్ పై వస్తున్న అభిషేక్ (26) నీలోఫర్ (25) అనే వైద్య మిషన్ శాఖలో పనిచేస్తున్న యువతీయువకులు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి చెట్టుకు ఢీకొన్నారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.


జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం


చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు


సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షాలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.


సమ్మక్కగద్దె


క్యూలైన్లలో భక్తుల రద్దీ







ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

సీడీపీవో అక్రమాలపై విచారణ

మంథని, ఫిబ్రవరి 22: మంథని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో పద్మశ్రీ అక్రమాలపై గురువారం పీడీ రౌఫ్‌ఖాన్ విచారణ చేశారు. మంథని ప్రాజెక్టులో పని చేస్తున్న స్వరూప అనే సూపర్‌వైజర్ ఏప్రిల్, మే నెలలో విధులకు హాజరుకాకున్నా జీతం చెల్లించారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో పీడీ విచారణ చేపట్టారు. ఇద్దరు సూపర్‌వైజర్లు తామే ఫిర్యాదు చేసినట్టు పీడీకి వాంగ్మూలం ఇచ్చినప్పటికీ లిఖితపూర్వకంగా తెలియజేయలేదని పీడీ వెల్లడించారు. ఫిబ్రవరి 6 నుంచి మార్చి 4 వరకు మంథని సీడీపీవో సెలవు లో ఉండగా రజిత అనే సూపర్‌వైజర్‌కు ఇన్‌చార్జి సీడీపీవోగా బాధ్యతలు అప్పగించారు. అయితే కార్యాలయానికి సంబంధించిన కారును మాత్రం సీడీపీవో ఆఫీసుకు స్వాధీనపరచకపోవడంతో దీనిపై కూడా విచారణ చేపట్టారు. సీడీపీవో విధులకు హాజరుకాని సూపర్‌వైజర్‌కు జీతం చెల్లించడంతో పాటు కారును స్వాధీనపర్చకపోవడం సరైనది కాదని, కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని పీడీ తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పాలకుర్తి, ఫిబ్రవరి 22: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఎంపీడీవో శశికళ వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో షబ్బీర్ పాషా, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు ఉన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేసే యంత్రానికి ట్రయల్ రన్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 22: ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేసి బూడిదగా మార్చే ప్లాస్టిక్ కోర్ ఇన్సులేటర్ యంత్రానికి గురువారం కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. గౌతమినగర్‌లోని డ్రైరిసోర్స్ సెంటర్‌లో యంత్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ చెప్పారు. తక్కువ విద్యుత్ వినియోగంతో రోజుకు 750కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బూడిద చేస్తుందని, చెత్త రీసైక్లింగ్ చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ యంత్రం ద్వారా వచ్చే బూడిదతో ఇటుకలు తయారు చేసుకోవచ్చని చెప్పారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, ఏఈ షాబాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాం సుందర్, ఎలక్ట్రికల్ ఏఈ రాంజీ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్‌లున్నారు.

రైతులపై కాల్పులకు నిరసన

అంతర్గాం, ఫిబ్రవరి 22: సంయుక్త కిసాన్‌మోర్చా పిలుపు మేరకు మండలంలో కళ్లకు గంతలు కట్టుకుని గురువారం నిరసన తెలిపారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య మాట్లాడుతూ హర్యాన సరిహద్దుల్లో రైతులపై కాల్పులు జరపడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిరసనలో నాయకులు కొల్లూరి మహేష్, టీ రాజకొమురయ్య, బీ రామస్వామి, పీ రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్‌లో పనుల పేరిట వసూళ్లు..

- టెండర్ గడువు పూర్తవడంతో రోడ్డున పడ్డ కార్మికులు
- డబ్బుల వాపసుకు ముఖం చాటేస్తున్న దళారులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 22: రామగుండం నగరపాలక సంస్థలో పనుల పేరిట ప్రజాప్రతినిధులు, ఉద్యోగి, దళారులు రూ.50లక్షలు వసూళ్లు చేశారు. ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేసిన వాహనాలపై డ్రైవర్లు, హెల్పర్లుగా పనులు పెట్టిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు వసూలు చేశారు. వారి పేర్లు ఎక్కడా కూడా మున్సిపల్ రికార్డులకెక్కలేదు. మూడేళ్లుగా వారు పని చేస్తుంటే వేతనాలు మాత్రం మూడు నెలలే వచ్చాయి. పనులు లేక, వేతనాలు రాక, కుటుంబాలు గడవక, డబ్బులు వాపసు ఇవ్వమంటే దళారులు ముఖం చాటేస్తున్నారు. నగరపాలక సంస్థలో 14వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ఆగ్రోస్ ఏజెన్సీగా పారిశుధ్య విభాగానికి సుమారు రూ.10 కోట్లు ఖర్చుపెట్టి వాహనాలు కొనుగోలు చేశారు. డ్రైవర్లు, క్లీనర్లు, హెల్పర్లు తదితర పనులు పెట్టిస్తామని, పనులు శాశ్వతమంటూ కొందరు కార్పొరేటర్లు, ఒక పారిశుధ్య అధికారి, దళారులు అమాయకులకు నమ్మబలికారు. ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు వసూలు చేశారు. 2021లో వీరు పనుల్లో చేరినా ఆగ్రోస్ సంస్థకు మధ్యవర్తిగా వ్యవహరించిన ఒక ఏజెన్సీ తనదే నిర్వహణ బాధ్యతంటూ పేర్కొంది. తరువాత వేతనాలు ఇవ్వక చేతులెత్తేసింది. గత ఏడాది 21మంది కార్మికుల సేవలు వినియోగించుకునేందుకు ఇంజనీరింగ్ విభాగం టెండర్లు నిర్వహించింది. ఆ టెండర్ సరైన పత్రాలు లేని సంస్థకు అప్పగించడంతో వీరికి ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం అందలేదు. మూడు నెలల వేతనాలు మాత్రమే అందాయి. టెండర్ గడువు పూర్తయినా వీరితో పనులు చేయించారు. వీరికి ఇప్పటికీ 8నెలల వేతనాలు రావాల్సి ఉంది. కొన్నిరోజులు వారధి ద్వారా చేయిస్తామని నమ్మబలికారు.ఇటు నగరపాలక సంస్థ అధికారులు, కార్మిక నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. పనులు వారధితో సాధ్యం కాదని విధులకు హాజరుకావద్దంటూ అధికారులు పేర్కొన్నారు. వీరి దగ్గర డబ్బులు దండుకున్న దళారులు డబ్బులు వాపసు ఇచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ఇన్నాళ్లు ఎప్పుడో ఒకసారి తాము కార్పొరేషన్ రికార్డుల్లో ఉంటామని ఆశపడ్డ కార్మికులు మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలి

- నిధులు తెచ్చే బాధ్యత నాది.. - నూతన పరిశ్రమలతోనే రామగుండానికి పూర్వ వైభవం
- డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి - కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అనీల్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 22: రామగుండం నగరపాలక అభివృద్ధికి నిధులు తెచ్చే బాధ్యత తనదని, పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన జరిగిన రామగుండం నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండంలో ఓపెన్‌కాస్టులు తవ్వడం, పరిశ్రమలు మూతపడడం వల్ల ఉపాధి తగ్గిందని, ఎన్‌టీపీసీ ప్లాంట్ విస్తరణ, జెన్‌కో కొత్త ప్లాంట్ ఏర్పాటు, కొత్త పరిశ్రమలు తీసుకురావడం ద్వారా పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో రామగుండం సమస్యలను ప్రస్తావించామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి సంపూర్ణంగా అభివృద్ధి చేయడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. గతంలో ప్రభుత్వరంగ సంస్థల సీఎస్‌ఆర్ నిధులు, డీఎంఎఫ్‌టీ నిధులను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారని, ఈసారి అలా తరలించకపోకుండా స్థానికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. నగరంలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేసి ప్రముఖ వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. మొదటి విడుతలో రూ.10కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు లక్ష్మీనగర్ అభివృద్ధికే వెచ్చించామన్నారు. రూ.29కోట్లతో నియోజకవర్గంలో ఇతర అభివృద్ధి చేపట్టామన్నారు. ఇవే కాకుండా రూ.250కోట్ల అమృత్ నిధులతో నగరంలో కాలువలు, గోదావరినదిలో మురుగు నీరు చేరకుండా ఎస్‌టీపీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రూ.100 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులను కూడా తీసుకువచ్చేందుకు పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో పారిశుధ్యంకు ఎక్కువ నిధులు కేటాయించాలని సూచించారు.

రూ.211.22కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

రామగుండం నగరపాలక సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.211.22 కోట్ల అంచనాలతో వార్షిక బడ్జెట్‌కు నగర పాలక సంస్థ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గురువారం మేయర్ బంగి అనీల్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 2023-24 సవరించిన బడ్జెట్‌తో పాటు 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత బడ్జెట్ కంటే 4శాతం తక్కువ అంచనాలతో బడ్జెట్ రూపొందించారు. ఈసారి బడ్జెట్‌లో ఆచితూచి అంచనాలను లెక్కగట్టారు. ముఖ్యంగా గ్రాంట్ల విషయంలో కొంత జాగ్రత్తలు తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో 205.04కోట్ల గ్రాంట్లు వస్తాయని అంచనా వేయగా జనవరి నాటికి రూ.38కోట్లే వచ్చాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సారి గ్రాంట్లను రూ.196.42కోట్లకు లెక్క గట్టారు. ఇందులో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.50కోట్లు, డీఎంఎఫ్‌టీ రూ.17కోట్లు, ఎన్‌టీపీసీ, సింగరేణి సీఎస్‌ఆర్ నిధులు రూ.10కోట్లు, 15వ ఆర్థిక సంఘం రూ.10కోట్లు, పట్టణ ప్రగతి నుంచి రూ.10కోట్లు, అమృత్ నుంచి రూ.50కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఇక సాధారణ ఆదాయంను మాత్రం రూ.2కోట్లు పెంచి అంచనాలు వేశారు. ఇందులో ఆస్తి పన్ను వసూళ్ల అంచాలను గతంలో కంటే రూ.10లక్షలు పెంచి రూ.9.45కోట్లుగా అంచనా వేశారు. మొత్తంగా ఆస్తి పన్ను రూ.17.3కోట్లు అంచనా వేశారు. ఇందులో ఖాళీ స్థలాలపై పన్ను వీఎల్‌టీ రాదని అంచనాల్లో లెక్కలు కట్టలేదు. షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, ఇతర కిరాయిల ద్వారా రూ.99లక్షలు వస్తాయని అంచనా వేశారు. ఇక జిల్లా కలెక్టర్ రామగుండం ఆదాయంలో హోర్డింగ్‌లు, ఇతర ప్రకటనలపై పన్నులు పెంచాలని సూచించారు. అయినా రూ.15లక్షలే లెక్కగట్టారు. ఇక ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయం రూ.80లక్షల నుంచి రూ.1కోటికి పెంచే అవకాశం ఉంది. గత బడ్జెట్‌లో రూ.30లక్షలు పెట్టగా ఈ సారి రూ.45 లక్షలకు పెంచారు. భవన నిర్మాణ అనుమతుల ద్వారా రూ.10కోట్లు, ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రూ.1.2కోట్లు వస్తాయని అంచనాలు లెక్కగట్టారు. ఇక సాధారణ ఆదాయం రూ.38.02కోట్లు లెక్కలు గట్టి అందులో నుంచి 10శాతం నిధులు రూ.3.8కోట్లు గ్రీన్ బడ్జెట్ క్రింద హరిత హారానికి కేటాయించారు. జీతాలు, ఇతర చెల్లింపులకు రూ.14.5కోట్లు, శానిటేషన్ నిర్వహణకు రూ.6కోట్లు, వీధి దీపాల విద్యుత్ చార్జీలకు రూ.2కోట్లు కేటాయించారు. వాహనాల ఇంధనానికి రూ.2.5కోట్లు, రిపేర్లకు రూ.52 లక్షలు, ఉత్సవాలు, పండుగలకు రూ.90లక్షలు కేటాయించారు. కార్పొరేటర్లు, మేయర్ వేతనానికి రూ.65లక్షలు కేటాయించారు.

ఆస్తి పన్ను పెంచేందుకు ఇంటింటా సర్వే..

రామగుండంలో వ్యయానికి తగినంత ఆదాయం లేదని, ఆదాయం పెంచుకనేందుకు ఏప్రిల్ 1వ తేది నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే చేసి ఆస్తి పన్ను పునః సమీక్షిస్తామని మేయర్ బంగి అనీల్ కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంత మంది రేకుల షెడ్ల యజమానులు పక్కా భవనాలు నిర్మించుకున్నా, భవనాలపై అంతస్థులు నిర్మించుకున్నా పన్నులు పెంచడం లేదన్నారు. రామగుండం నగర అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విశేష కృషి చేస్తున్నారన్నారు.

డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ, అమృత్ నిధులతో డివిజన్‌లో అభివృద్ధి పనులు జరిగితే నగర రూపురేఖలే మారిపోతాయన్నారు. నగరపాలక సంస్థపై ఆర్థిక భారం పడకుండా ఈ సారి సమ్మక్క-సారలమ్మ జాతరకు సింగరేణి, ఎన్‌టీపీసీ నుంచి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అధిక నిధులు ఇప్పించారని మేయర్ తెలిపారు.

జాతరలో భక్తులు స్వీయ పరిశుభ్రత పాటించాలి

ఎలిగేడు, ఫిబ్రవరి 22 : సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులు స్వీయ పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ నిస్సిక్రిష్టాన అన్నారు. ఎలిగేడు, లాలపల్లి పొలిమేరల్లోని పెల్లిపోరు గుట్టపై జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సందర్శించి సిబ్బందికి పలుసూచనలు సలహాలు అందించారు. జాతర పూర్తయ్యేవరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, రాజేశ్వరిదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విప్ అడ్లూరికి మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శ


అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మారం, ఫిబ్రవరి22: ఇటీవల ప్రమాదంలో గాయపడి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. ప్రమాద వివరాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి అర్చకుల క్షీరాభిషేకం

పెద్దపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా గురువారం హైదరాబాద్‌లోని నేరేడుచర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్థానిక రామాలయంలో ధూపదీప నైవేద్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంబోట్ల ఫణికుమార్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

●రామగిరి: రామగిరి మండలం బేగంపేట్ గ్రామంలోని రాజరాజేశ్వర దేవాలయంలో పలువురు అర్చకులు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మంత్రి ఆదేశాలతో కెనాల్ మరమ్మతుకు చర్యలు

రామగిరి, ఫిబ్రవరి 22: మండలంలోని బుధవారంపేట పరిధీలో గల 8ఎల్, ఆర్‌ఎస్‌బి-డి83 కెనాల్ మరమ్మతుల విషయంపై గురువారం ఎస్‌ఆర్‌ఎస్‌పీ అధికారులు కెనాల్ పరిస్థితులను పర్యవేక్షించారు. కెనాల్ శిథిలావస్థకు చేరుకొని టెలెండ్ ప్రాంతానికి చెందిన రైతులకు సాగు నీరు అందడం లేదని మాజీ సర్పంచ్ బుద్దార్థి బుచ్చన్న మంత్రి శ్రీధర్‌బాబు దృష్టి తీసికెళ్లడంతో రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ ఎస్ఈ సత్యరాజ్, చంద్ర, డీఈ బలరాం, ఏఈ రాజేందర్, ఏఈ సుబ్బారామిరెడ్డి ఆధ్వర్యంలో పర్యవేక్షించి కెనాల్ మరమ్మతులకు కొలతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లిదేవక్క, నాయకులు కొంరయ్యగౌడ్, రైతులు పాల్గొన్నారు.

'ప్రధాని నరేంద్రమోదీని ఓడించాలి'

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 22: దేశంలో మోదీ హఠావో... అంబేద్కర్ సమిదన్ బచావో అంటూ దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వట్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాధికార సందేశ్ యాత్రలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో యాత్ర చేస్తున్నట్టు, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ పార్లమెంట్ స్థానాల్లో ఈ యాత్ర ఉంటుందన్నారు. దళితులకు జీవన, సామాజిక, ఆర్థిక, మానవ హక్కులు కల్పించాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి నరేంద్ర మోదీ సర్కార్ కుట్ర చేసిందని ఆరోపించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మనువాదుల ప్రభుత్వానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వంటి దోపిడీ, కుల పార్టీలకు మద్దతు ఇస్తునిస్తున్నాయని చెప్పారు. దళిత బహుజనులకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ద్రోహం చేశాయని ఆరోపించారు. పార్లమెంట్‌లో దళిత జాతి గళం వినిపించాలంటే అంబేద్కర్ వాదులైన దళిత, బహుజన పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. దోపిడీ కులాల పార్టీలను ఓడించకపోతే దళిత జాతికి తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో నీరటి శంకర్, కరుణాకర్, రాంచందర్, వెంకటేష్, దేవి లక్ష్మీనర్సయ్య, కార్తీక్ పాల్గొన్నారు.